



డోలోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న చిన జీయర్‌స్వామి

కనుల పండువగా డోలోత్సవం

వైభవంగా కొనసాగుతున్న సమతా కుంభ్ బ్రహ్మోత్సవాలు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముచ్చింతల్ సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో సమతా కుంభ్ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అధ్యాత్మిక గురువు చిన జీయర్ స్వామి పర్యవేక్షణలో సోమవారం సుప్రభాత సేవ, అష్టాక్షరీ మంత్ర జపం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అరగంట పాటు ధ్యానం నిర్వహించారు. ఆరాధన, సేవాకాలంలో భాగంగా శాత్తుముఱై జరిపించారు. అనంతరం డోలోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. చతుర్వేద పారాయణం, సంకీర్తనలు పాడారు. అర్చకులు పెరుమాళ్లకు ఊయలలు ఊపారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేసి, మంగళశాసనములు అందజేశారు. డోలోత్సవాన్ని సందర్శిస్తే గృహదోశాలు తొలగిపోతాయని చినజీయర్ స్వామి వివరించారు. ఈ ఉత్సవాలు మరో రెండు రోజుల పాటు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి, మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్యాట్రిసియా స్కాట్లాండ్

పర్యావరణాన్ని పరిరక్షించాలి

- కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్

నందిగామ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను బాల్యం నుంచే పర్యావరణ పరిరక్షణకు సిద్ధం చేయాలని కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్ సూచించారు. నందిగామ మండలపరిధిలోని కన్హాశాంతివనంలో నిర్వహిస్తున్న సస్టైనబిలిటీ ఇన్ క్లాస్‌రూమ్ కార్యక్రమంలో భాగంగా రెండవరోజు హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్‌నేషనల్ స్కూలును సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ద్వారా విద్యలో పురోగతి, పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు చాలా సంతోషాన్ని ఇస్తున్నాయన్నారు. విద్యార్థులకు చిన్న వయసులోనే పర్యావరణ స్పృహను పరిచయం చేయడం ద్వారా స్థిరత్వ భావనకు గుర్తై భవిష్యత్తుకు నాయకులుగా రూపొందిస్తుందన్నారు. ఆచరణాత్మక విధానంతో తరగతి గదులకు స్థిరత్వాన్ని తీసుకురావడంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్‌నేషనల్ స్కూల్ చొరవ ఆకట్టుకుందన్నారు. అంతకుముందు విద్యార్థులు సంస్కృత శ్లోకాలతో ఆమెకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో రామచంద్రమిషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రంగరాజన్‌పై దాడి కేసు..
మూడు రోజుల కస్టడీకి వీరరాఘవరెడ్డి
7



వికారాబాద్‌లోని డంపింగ్ యార్డు

చెత్తశుద్ధి ఏది?

బల్దియాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను చెత్త సమస్య వేధిస్తోంది. మున్సిపాలిటీల్లో లక్షల టన్నుల్లో చెత్తపేరుకుపోయింది. చెత్తను క్లీన్ చేసేందుకు చేపట్టిన బయోమైనింగ్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. బయో మైనింగ్ విధానంలో చెత్త భూమిలో పాతి పెట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. దీంతో డంపింగ్ యార్డులు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చెత్తను కాల్చడం ద్వారా సమీపంలోని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

- డంపింగ్ యార్డుల ప్రక్షాళన శూన్యం
- బయోమైనింగ్ లేక పేరుకుపోతున్న వ్యర్థాలు
- నిప్పుపెట్టడంతో ప్రజలకు అనారోగ్య సమస్యలు
- బయోమైనింగ్‌కు ఎంపికైన వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీలు
- అయినా అమలుకు నోచని వైనం
- తుక్కుగూడలోనూ ప్రారంభం కాని పనులు
- పరిగిలో డంపింగ్ యార్డు సమస్య

జిల్లా	మున్సిపాలిటీలు	కార్పొరేషన్లు
రంగారెడ్డి	15	03
వికారాబాద్	04	00
మేడ్చల్	09	05
మొత్తం	28	08



చేవెళ్ల సంతలో చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలు బయోమైనింగ్‌కు దూరంగా ఉంటున్నాయి. డంపింగ్ యార్డులు ప్రక్షాళన జరగడం లేదు. జనాభా పెరుగుదలతో పాటు కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. ఇదే తరహాలో చెత్త కూడా పేరుకుపోతుంది. ఏళ్ల తరబడి చెత్త సమస్య అపరిష్కృతంగానే ఉంటుంది. బయోమైనింగ్ విధానంలో చెత్త భూమిలో పాతి పెట్టేందుకు ప్రభుత్వ ప్రణాళికలు రూపొందిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. చెత్తశుద్ధి జరగడం లేదు. డంపింగ్ యార్డులో వ్యర్థాలు టన్నుల కొద్దీ పేరుకుపోతున్నాయి. చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య

మిగతా 7వ పేజీలో...



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం

- అంగరంగ వైభవంగా వేంకటేశ్వర స్వామి పరిణయం

కేశంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల కేంద్రంలోని దవళగిరి గుట్టపై వెలసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అలవేలుమంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి రోహిణి, మాజీ ఎంపీటీసీ యాదయ్య చారిఅమృతమ్మ, తలసాని శ్యామ్ సుందర్ రెడ్డి నవనీత దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పండింతులు రాఘవ శర్మ, రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో కల్యాణ తంతు నిర్వహించారు. ఈ వేడుకకు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, అంజయ్య యాదవ్ హాజరయ్యారు. కల్యాణాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం తలసాని వెంకట్ రెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సజ్జల విశ్వనాథం, మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, ఏపీ మిధున్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి, ప్యాక్ డైరెక్టర్ మఠం చంద్రశేఖర్, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ ఎంపీపీ వర్కాల లక్ష్మీ నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి అమృత్ 2.0 పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

రాజకీయాలకతీతంగా అభివృద్ధి సాధిద్దాం

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరముందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకేఅరుణ అన్నారు. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్‌లోని 10వ వార్డులో అమృత్ 2.0 పథకాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీలు వేరైనా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కలిసి పని చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.398 కోట్లు విడుదల చేసిందన్నారు. రెండుమూడుచోట్ల స్థల సేకరణలో జాప్యం వల్ల పనులు ప్రారంభించేందుకు ఆలస్యం జరిగిందన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు 24గంటల పాటు తాగునీరు అందించేందుకు రూ. 27.5 కోట్లు కేంద్రం విడుదల చేసిందని, ఈ నిధులతో మొదటి దఫాలో రెండు వాటర్ ట్యాంకర్ల నిర్మాణంతో పాటు, 50కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. రెండో దఫా కింద రాష్ట్ర ప్రభుత్వ వాటా, మున్సిపాలిటీ వాటా నిధులను విడుదల చేయించేందుకు ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెబాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న లబ్ధిదారులు, సీపీఎం నాయకులు

రామోజీ ఫిలిం సిటీలో ఇంటి స్థలాలు ఇవ్వాలి

- సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గతంలో పట్టాలిచ్చిన లబ్ధిదారులకు రామోజీ ఫిలింసిటీలో ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. వినతి చేసిన వారిలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, నాయకులు సామెల్, బుగ్గ రాములు, జంగయ్య, జగన్, నర్సింహ్మా, భిక్షపతి, అశోక్, కరుణాకర్‌రెడ్డి, యాదయ్య, స్వామి, రఘు, రాములు, ధనేశ్వర్, చరణ్, శ్రీకాంత్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

ఆమనగల్లులో నేడు రైతు నిరసన దీక్ష

- హాజరు కానున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమనగల్లులో మంగళవారం రైతు నిరసన దీక్ష, బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే రైతుదీక్షను విజయవంతం చేయడానికి సోమవారం నాయకులు, కార్యకర్తలతో



రైతుదీక్ష సభా ప్రాంగణం

మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ సమావేశమయ్యారు. రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌తో కలిసి సభ ఏర్పాట్లను, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. రైతుదీక్షకు కేటీఆర్ వస్తున్న నేపథ్యంలో కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు, మాడ్గుల, కల్వకుర్తి, వెల్దండ మండలాలల్లో పెద్దఎత్తున హోర్డింగ్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు అనురాధపత్యానాయక్, జర్పుల దశరథ్ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి 64 ఫిర్యాదులు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 64 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జీవ భద్రత విధానాన్ని పాటించాలి

- పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి
- కోళ్ల ఫాం రైతులకు అవగాహన



పోచారంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కోళ్ల ఫారాల రైతులు తప్పనిసరిగా జీవ భద్రత (బయో సెక్యూరిటీ) విధానాన్ని పాటించాలని, లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.విజయ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని పోచారం గ్రామంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకుతున్నట్లు ప్రచారం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బయో సెక్యూరిటీలో భాగంగా కోళ్ల ఫారంలోకి వెళ్లే ప్రతీఒకరు వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. సబ్బుతో శుభ్రంగా స్నానం చేయాలని, చెప్పులను క్రిమినాశిని మందులైన గుట్లరాల్డిహిడ్, ఫార్మిల్లిహిడ్ ద్రావణంతో శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా కోళ్లు తాగే నీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. కోళ్ల వ్యాక్సిన్, దాణా వాహనాలను, గుడ్ల ట్రేలను క్రిమినాశిని మందులతో స్ప్రే చేసిన తర్వాతనే ఫారంలోకి తీసుకెళ్లాలన్నారు. వలస పక్షులు, కొంగలు, కాకులు ఫారంలోకి రాకుండా ఇనుపవల, లేదా గ్రీన్ మెష్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కుక్కలు, పిల్లులు, ఎలుకలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. సాధారణ వ్యాధులతో చనిపోయే కోళ్లను విధిగా పెద్ద గోతిలోవేసి పొడి సున్నం చల్లి పూడ్చాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చనిపోయిన కోళ్లను ఆరుబయట పడేయొద్దన్నారు. జీవ భద్రత పాటిస్తే కోళ్లకు రోగాలు వచ్చే అవకాశం ఉండదని, ప్రజలకు యాంటీ బయోటిక్స్‌లేని కోడి మాంసం అందుతుందన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.శ్రావణ్‌కుమార్, ఇబ్రహీంపట్నం మండల పశు వైద్యాధికారి డా.వై.ఆనంద్‌రెడ్డి, జూనియర్ వెటర్నరీ అధికారి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

ఏఐసీసీ పెద్దలంతా ఎన్‌ఎస్‌యూఐ నుంచి వచ్చిన వారే

- బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- రెండో రోజుకు చేరిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ శిక్షణ తరగతులు
- హాజరైన యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాను



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మహేశ్వరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేలా యువజన కాంగ్రెస్ నాయకులు ముఖ్య భూమిక పోషించాలని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అధ్యక్షతన మహేశ్వరం మండలం గట్టుపల్లి గ్రామంలోని కేసీఆర్ గార్డెన్ (సోనియమ్మ కుటీరమ్)లో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర యువజన కాంగ్రెస్ యువక్రాంతి పేరుతో

మిగతా 8వ పేజీలో...

రానున్న రోజుల్లో అధికారం బీఆర్‌ఎస్‌దే

- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ హయాంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో కొనసాగిందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం ఇబ్రహీంపట్నంలో కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాణత్యాగానికి సిద్ధపడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను ప్రజలు తమ గుండెల్లో పెట్టి చూసుకుంటున్నారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనక్కి నెట్టిందని విమర్శలు చేశారు. రాబోయే రోజుల్లో అధికారం బీఆర్‌ఎస్‌దేనని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు సాధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, ఆకుల యాదగిరి, బూడిద రాంరెడ్డి, చంద్రయ్య, కృపేష్, బుగ్గరాములు, భరత్‌రెడ్డి, అల్వాల వెంకట్‌రెడ్డి, జెర్కోని రాజు, నిట్టు జగదీశ్వర్, శివసాయి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

కేసీఆర్ జన్మదినం సందర్భంగా వినోభానగర్‌లోని మాతాపితరుల సేవా సదన్‌లో జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్‌లో దివ్యాంగులకు, ఉప్పరిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.



ఇబ్రహీంపట్నంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

పేదల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం



పూడూరు రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పేదలు అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ లక్ష్యం అని, పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పూడూరులోని రైతు వేదికలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో75శాతం సబ్సిడీపై రూ.47 లక్షల విలువగల 158 స్ప్రింక్లర్ల యూనిట్లను రైతులకు అందజేశారు. అనంతరం మన్నెగూడ, అంగడి చిట్టెంపల్లి, పెద్ద ఉమ్మెంతాల్‌లో రూ.3.2కోట్లతో నిర్మించిన గోదాంలను ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇస్తున్న రైతు భరోసా సాయం మొత్తం ఎక్కువన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మండలానికో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి పేదలందరికీ ఇళ్లను కట్టిస్తామన్నారు. నియోజకవర్గంలో రెండు విడతల్లో 7వేల ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. రైతులకు 75శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లను ఇచ్చింది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వాలేనన్నారు. 41గుంటలకు మించి భూమి బోరు/బావి ఉన్న రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పట్టా పాస్బుక్కు, ఆధార్, బ్యాంకు పాస్బుక్కు, ఫొటోలతో మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25 పైపులు, 5 స్ప్రింక్లర్ సెట్లకు రైతులు రూ.7,500ల డీడీ తీసి దరఖాస్తుకు జత పరిచి ఉద్యానవన శాఖ అధికారులకు అందజేయాలని తెలిపారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ సర్కారు సబ్సిడీ స్కీంలు ఇవ్వకుండా రైతులకు నష్టం చేసిందన్నారు. కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, ప్యాక్స్ చైర్మన్ సతీష్‌రెడ్డి, జిల్లా ఉద్యాన/పట్టుపరిశ్రమ అధికారి ఎంఏ.సత్తార్, ఉద్యాన అధికారి వైజయంతి, తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీవో పాండు, ఏవో తులసీరాం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సురేందర్, నాయకులు కద్మూరు ఆనందం, పెంటయ్య శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, నారాయణ, రాములు, వీరేశ్, అజీంపటేల్, షకీల్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏవోతో కలిసి వ్యవసాయ శాఖ డెయిరీ, క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

క్రాంతికిరణ్‌కు కృష్ణదేవరాయ ప్రతిభా పురస్కారం



వెంకటక్రాంతికిరణ్

కడ్తాల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రావిచెడ్ గ్రామానికి చెందిన పుట్టపాక వెంకటక్రాంతి కిరణ్‌కు శ్రీకృష్ణదేవరాయ ప్రతిభా పురస్కారం దక్కింది. శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా యేటా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సామాజిక కార్యకర్తలకు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రైడ్ ఇండియా, సిటిజన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేస్తారు. ఈ ఏడాది వైద్య, రక్తదాన శిబిరాలు, చట్టాలు, న్యాయవ్యవస్థపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రాంతికిరణ్‌ను ఎంపిక చేశారు. సోమవారం తిరుపతిలో సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు బాల్‌రాజ్, ప్రైడ్ ఇండియా కల్చరల్ సీఈవో వెంకటేశ్వర్‌రావు, టీడీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డిలు క్రాంతికిరణ్‌కు అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

కేంద్ర స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక



యోగీశ్వర్ స్పందన శరణ్య

కేశంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనానికి(ఎన్ఎంఎంఎస్) కొత్తపేట పీఎం శ్రీ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. 8వ తరగతి విద్యార్థులకు జాతీయ స్థాయిలో తొమ్మిదో తరగతి నుంచి ఏటా రూ.12,000 స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నవంబరులో ఎంపిక పరీక్ష నిర్వహిస్తుంది. ఎంపికైన విద్యార్థులు డిగ్రీ పూర్తిచేసే వరకు స్కాలర్‌షిప్‌ను ఏటా బ్యాంక్ అకౌంట్‌లో వేస్తారని ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఇటీవల విడుదలైన ఎంపిక జాబితాలో కొత్తపేట స్కూల్ విద్యార్థులు జువ్వ స్పందన, మారెపల్లి శరణ్య, కుంటి యోగీశ్వర్ ఉన్నారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, సబ్జెక్ట్ టీచర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ గోపిలను ఎంఈవో అభినందించారు.

ఫీజు చెల్లించలేదని విద్యార్థులను ...

అనుమతించని యాజమాన్యం

- గంటలపాటు పాఠశాల ఆవరణలో కూర్చోబెట్టిన వైనం
- నందిగామ మండలం హిప్పో క్యాంపస్ స్కూల్లో ఘటన
- ఆవేదన వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు



హిప్పో క్యాంపస్ స్కూల్ ఆవరణలో కూర్చున్న విద్యార్థులు

నందిగామ, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఫీజు చెల్లించలేదని విద్యార్థులను తరగతి గదిలోకి అనుమతించకుండా పాఠశాల ఆవరణలో కూర్చోబెట్టిన సంఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం హిప్పో క్యాంపస్ స్కూల్లో సోమవారం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి యాజమాన్యంతో మాట్లాడారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలు రాయిస్తామని చెప్పారని తల్లిదండ్రులు వాపోయారు. తోటి విద్యార్థుల ముందు ఇలా అవమానకరంగా బయట కూర్చోబెడితే విద్యార్థులకు ఏమైనా జరిగితే బాధ్యులు ఎవరని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్కూల్ యాజమాన్యం స్పందిస్తూ.. ఫీజు చెల్లించని విద్యార్థులను మీటింగు హాల్లో కూర్చోబెట్టామని, ఎండలో కూర్చోబెట్టలేదని తెలిపారు. ఫీజు కట్టకుంటే స్కూల్‌ను ఎలా రన్ చేస్తామని అన్నారు. ఫీజ్ చెల్లించాలని ఎన్నోసార్లు చెప్పినా స్పందించడం లేదని చెప్పారు.

బకాయిలు చెల్లించకుంటే సీజ్

- పన్ను వసూళ్లపై బల్దియా అధికారుల దూకుడు
- రంగంలోకి మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ విభాగ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఇంటి యజమానితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

తాండూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పేరుకుపోతున్న ఆస్తి పన్ను, కమర్షియల్ ట్యాక్సుల మొండిబకాయిలు.. అధికారుల నిర్లక్ష్య ధోరణిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో మున్సిపల్ యంత్రాగం కదుల్తోంది. సోమవారం మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి ఆధ్వర్యంలో బల్దియా రెవెన్యూ శానిటేషన్ విభాగాల సిబ్బంది బకాయిదారుల వద్దకు పన్ను చెల్లించాలని కోరారు. పెద్దేముల్ రోడ్డులో ఐదేళ్లుగా ట్యాక్స్ కట్టకుండా నిర్వహిస్తున్న సన్సార్ లాడ్జి, రెస్టారెంట్ బిల్డింగ్‌పై దాడులు నిర్వహించి బకాయిలు చెల్లించకుంటే సీజ్‌చేస్తామని హెచ్చరించారు. దీంతో యజమాని మంగళవారం సాయంత్రం వరకు కమిషనర్‌ను గడువు కోరారు. నేటి సాయంత్రంలోగా రూ.11లక్షల ఆస్తిపన్ను కట్టకుంటే బిల్డింగ్‌కు తాళం వేస్తామని, ఇక గడువు ఇవ్వం అని కమిషనర్ తేల్చి చెప్పారు. పక్కనే ఉన్న మెట్రో ఫంక్షన్ హాల్ వద్దకు వెళ్లి బకాయిలు చెల్లించకుంటే సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ఫంక్షన్ హాల్‌కు సంబంధించి రూ.12.97లక్షల బకాయుండగా యజమాని రూ.6.5లక్షల చెక్కు, రూ.1.91లక్షల నగదును చెల్లించారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పన్ను వసూళ్లలో దూకుడు పెంచాలని అధికారులు నిర్ణయించారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 14న 'పన్ను వసూళ్లలో తాండూరు లాస్ట్'.. అలాగే ఈ నెల 15న 'పన్ను వసూళ్ల లక్ష్యం చేరకుంటే వేటు' శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో మున్సిపల్ అధికారులు ఆస్తిపన్ను వసూళ్లకు డ్రైవ్ చేపడుతున్నారు. తాండూరు మున్సిపాలిటీలో ఇప్పటి వరకు రూ.10కోట్ల పన్ను బకాయిలు రావాలని అధికారులు పేర్కొన్నారు.



బకాయిలున్న సన్సార్ కమర్షియల్ బిల్డింగ్

జీతాలివ్వడం లేదని ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు...
ఆత్మహత్యాయత్నం

» పరిస్థితి విషమం » హైదరాబాద్‌కు తరలింపు


చికిత్స పొందుతున్న నర్సిములు

తాండూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదని, బిడ్డ పెళ్లి ఉన్నదంటే కూడా ఏజెన్సీ నిర్వాహకులు జీతం ఇవ్వడం లేదనే మనో వ్యథతో ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యా యత్నం చేశాడు. ఈ ఘటన సోమవారం తాండూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాత తాండూరుకు చెందిన నర్సిములు తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో 30ఏళ్లుగా వివిధ ఏజెన్సీల ద్వారా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉండగా.. ఇటీవల రెండు నెలల జీతం చెల్లించారని, మరో రెండు నెలల బకాయిన్నాయని తెలిపాడు. ఆర్థిక ఇబ్బందులతో సోమవారం నర్సిములు పురుగుల మందు తాగాడు. తన కూతురు పెళ్లిపెట్టుకున్నామని, జీతాలు చెల్లించాలని కోరినా ఏజెన్సీ పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని నర్సిములు కోరాడు. మొదట అతడికి తాండూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు రెఫెర్ చేశారు.


నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

ఆస్పత్రి సిబ్బందిపై వేధింపులు ఆపాలి

తాండూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సిబ్బందిపై వేధింపులను అరికట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పత్రి వద్ద కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. గత 18నెలల నుంచి కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించని వినాయక ఏజెన్సీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందికి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. జీతాలివ్వడం లేదని, పీఎఫ్ జమ కాలేదని సెక్యూరిటీ గార్డ్ నర్సిములు ఆత్మహత్యాయత్నం చేశాడని అన్నారు. నిరసన కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవో డానియల్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సొంత డబ్బులుపెట్టి అప్పులపాలయ్యాం

కోట్‌పల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ఆగస్టు నెల నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపులు, పంచాయతీల నిర్వహణకు నిధులను విడుదల చేయాలని సోమవారం కోట్‌పల్లి మండల పరిషత్‌లో ఎంపీడీవో డానియల్‌కు తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరమ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. 2024 ఫిబ్రవరి నుంచి సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన నాటి నుంచి డబ్బులు రాలేదన్నారు. పారిశుధ్య నిర్వహణ, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్, ఇతర పనులకు సొంత డబ్బులు చెల్లించామన్నారు. బిల్లులను చెక్కుల రూపంలో చెల్లించామని, చెక్కులు ఐఎఫ్ఎంఎస్‌లో ఆగస్టు నుంచి పేమెంట్ కాలేదన్నారు. పంచాయతీల కోసం సొంత డబ్బు వెచ్చించామన్నారు. షాపులకు, వెండర్లకు ఇచ్చిన చెక్కులు గత ఆగస్టు నుంచి క్లియర్ కాలేదని తెలిపారు. వేసవిలో నీటి నిర్వహణకు భారీగా నిధులు కావాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నర్సిములు, రాఘువేందర్, ప్రవళిక, హేమలత, లావారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.


నక్ష సర్వే కోసం మార్కింగ్ చేసిన అధికారులు

నేటి నుంచి నక్ష సర్వే

కొడంగల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నక్ష పైలెట్ సర్వే కొడంగల్ మున్సిపాలిటీలో మంగళవారం నుంచి చేస్తామని తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తెలిపారు. సోమవారం మున్సిపల్ పరిధిలో నక్ష సర్వే నిర్వహణకు సర్వే ఆఫ్ ఇండియా విభాగాల ఆధ్వర్యంలో 20 పాయింట్లను మార్కింగ్ చేశారు. మున్సిపల్ పరిధిలో ఇళ్లు, ఖాళీ స్థలాలు, పట్టా భూములు, ప్రభుత్వ స్థలాల సర్వే చేసి హద్దులు, విస్తీర్ణాన్ని డిజిటలైజ్ చేస్తామని తెలిపారు. సర్వే కోసం ఇప్పటికే కొడంగల్‌కు హెలికాప్టర్ వచ్చినట్లు తెలిపారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

తాండూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)పార్టీ-2025 క్యాలెండర్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా సభ్యులు విఠల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి, నాయకులు నర్సిములు, రాజప్పగౌడ్, సలీం, నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, యాదప్ప, రాంలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుల రిమాండ్

» మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ కోటిరెడ్డి, వెనుకవైపు నిందితులు

మేడ్చల్‌టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో తీవ్ర కలకలం సృష్టించిన యువకుడి దారుణ హత్యకు సంబంధించిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఉమేశ్ అనే వ్యక్తిని హతమార్చిన వారిలో అతడి సొంత తమ్ముడు, మరో నలుగురు బంధువులున్నట్లు తెలిపారు. ఉమేశ్ చెడు వ్యసనాలను బానిసై కుటుంబీకులను శారీరకంగా వేధించడంతో తట్టుకోలేక ఉమేశ్ సొంత తమ్ముడు రాకేశ్, అతడి బాబాయి కొడుకు లక్ష్మణ్, మరో ముగ్గురు యువకులు (సమీప బంధువులు) బి.నవీన్, సురేష్, నరేష్‌లతో కలిసి హతమార్చారని వెల్లడించారు. ఉమేశ్‌పై కామారెడ్డి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో చైన్ స్నాచింగ్, గొడవలకు సంబంధించిన 14 కేసులున్నట్టు తెలిపారు. ఉమేశ్ కారణంగా కుటుంబం మనోవేదనకు గురవుతున్నారని, దీంతో అతడి చంపాలని సోదరుడు రాకేశ్, లక్ష్మణ్‌తో పథకం వేసి మరో ముగ్గురిని పిలుచుకున్నారన్నారు. ఆదివారం సాయంత్రం కూడా ఉమేశ్ ఇంట్లో గొడవపడి కుటుంబ సభ్యులను తిట్టడం చేశాడు. ఆగ్రహించిన రాకేశ్, లక్ష్మణ్‌లు ఉమేష్‌పై కత్తితో దాడి చేశారు. వారి నుంచి ఉమేష్ తప్పించుకొని ఆర్టీసీ డిపో వద్ద హైవేపైకి చేరుకున్నాడు. నిందితులు ఉమేష్‌ను వెంటాడుతూ రోడ్డుపైకి వచ్చి అందరూ చూస్తుండగానే కత్తులతో ఉమేశ్ గొంతుకోసి పొడిచి చంపి అక్కడి నుంచి పరారయ్యారని డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు.

గంటల వ్యవధిలోనే అదుపులోకి ...

స్థానికులను దిగ్భ్రాంతికి గురి చేసిన ఈ ఘటనకు సంబంధించి నిందితులను పోలీసులు గంటల వ్యవధిలోనే పట్టుకున్నారు. నిందితుల నుంచి నాలుగు సెల్‌ఫోన్‌లు, రెండు కత్తులు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. హత్యకు సూత్రధారి హతుడి సొంత తమ్ముడు రాకేశ్ కావడం గమనార్హం. నేరచరిత్ర గల తన అన్న కారణంగా కుటుంబీకులమంతా సమాజంలో తలెత్తుకోలేకపోతున్నామనే కోపంతోనే ఈ హత్య చేసినట్టు నిందితులు చెప్పారని పోలీసులు పేర్కొన్నారు.

చెత్త 'శుద్ధి' ఏది?

(ఐదో పేజీ తరువాయి)

కార్మికులు డంప్ చేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం లేదు. వ్యర్థాలను దహనం చేస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యానికి చేరువవుతోన్నారు. రోజు రోజుకూ వెలువడుతున్న వ్యర్థాలతో డంపింగ్ యార్డులు నిండిపోతున్నాయి. స్థలం సరిపడక చెత్త నిల్వలు ఉంచడం కష్టంగా మారుతోంది. నిల్వఉన్న వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా కనుమరుగు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆచరణ యోగ్యం కావడం లేదు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 28 మున్సిపాలిటీలు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో రంగారెడ్డి జిల్లాలో 15 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉండగా వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలున్నాయి. అలాగే మేడ్చల్ జిల్లాలో 9 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లు ఉన్నాయి. చాలావరకు చెత్తను పారిశుధ్య కార్మికుల ద్వారానే సేకరిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల్లో వికారాబాద్, తాండూరు బయోమైనింగ్ అమలుకు ఎంపికైనా కార్యరూపం దాల్చడం లేదు. బయో మైనింగ్ అమలు చేసేందుకు వికారాబాద్ మునిసిపాలిటీలో టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. అమలు బాధ్యతను పర్యవేక్షించాల్సిన సృష్టి అనే సంస్థ అధికారులు ఒకసారి మున్సిపల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆ తర్వాత ఇంత వరకు మళ్లీ వారు వికారాబాద్‌కు రాలేదు. పరిగి, కొడంగల్ మునిసిపాలిటీలు బయో మైనింగ్ పరిధిలో లేవు. ఈ మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ బండ్లు, ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా చేపడుతున్నారు. పరిగి మునిసిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు సమస్య నెలకొంది.


చేవెళ్ల మున్సిపాలిటీలో రోడ్డుపై శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

రంగారెడ్డి జిల్లాలో 15 మున్సిపాలిటీలు ఉన్నాయి. అందులో కొత్త మున్సిపాలిటీలుగా ఇటీవలే చేవెళ్ల, మొయినాబాద్ మండలాలు ఏర్పడ్డాయి. 15 మున్సిపాలిటీలతో పాటు 3 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. షాద్‌నగర్ మున్సిపాలిటీలో 28 వార్డులున్నాయి. సెగ్రిగేషన్ విధానం పూర్తిగా అమలు కావడం లేదు. ఒకే కవర్‌లో వేసి ఆటోలో వేస్తున్నారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం లేదు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించలేకపోతున్నారు. బయో మైనింగ్ విధానం గత 8 నెలల క్రితమే ప్రారంభమైంది. డంపింగ్ యార్డు పక్కనే దీనిని ఏర్పాటు చేసి చెత్తను శుద్ధి చేయడంతో పాటు సేంద్రీయ ఎరువును తయారు చేస్తున్నారు. చేవెళ్ల మున్సిపాలిటీకి ఇప్పటి వరకు చెత్త సేకరణకు ట్రాక్టర్లు ఇవ్వలేదు. ప్రస్తుతం ఉన్న పారిశుధ్య సిబ్బందితోనే గ్రామాల వారీగా చెత్తను సేకరిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో చెత్త సేకరణకు 10 ఆటోలు, నాలుగు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. చెత్త సెగ్రికేషన్ పూర్తి స్థాయిలో చేయడం లేదు. 25 శాతం మాత్రమే చేస్తున్నారు. బయో మైనింగ్ గాను డంపింగ్ యార్డులో మిషన్లు బిగించారు. కానీ.. ఇంకా ప్రారంభించ లేదరు. మహేశ్వరం మున్సిపాలిటీలో బయో మైనింగ్ పేరుతో చెత్త సెగ్రిగేషన్ చేసేందుకు పిలిచిన టెండర్లలో తుక్కుగూడ మున్సిపాలిటీని దక్కించుకున్న సంస్థ పనులను ఇంకా ప్రారంభించలేరు.

బయోమైనింగ్ అంటే?

డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను ప్రత్యేక యంత్రాల ద్వారా రీ సైకిల్ చేయడమే బయోమైనింగ్. 100 మిల్లీ మైక్రాన్ల (ఎంఎం) కంటే ఎక్కువ పరిమాణం ఉన్న వ్యర్థాలు ఉంటే పెద్ద ప్లాస్టిక్ బాటిళ్లు, కొబ్బరి బొండాలు, రాళ్లు, దస్తుల వంటి వాటితో పాటు ప్లాస్టిక్ మెటీరియల్‌లోనూ రీ సైక్లింగ్‌లలో వివిధ దశల్లో బయటకు వస్తాయి.

రంగరాజన్‌పై దాడి కేసు..
కస్టడీకి వీరరాఘవరెడ్డి

మొయినాబాద్: ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడిచేసిన కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డిని మూడు రోజులు పోలీసుల కస్టడీకి ఇచ్చేందుకు రాజేంద్రనగర్ కోర్టు అనుమతిచ్చింది. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న వీరరాఘవరెడ్డిని పోలీసులు కస్టడీకి తీసుకొని మూడు రోజుల పాటు విచారించనున్నారు. వీరరాఘవరెడ్డిని ఎక్కడ విచారించాలనేది ఇంకా నిర్ణయించలేదు. దాడికి సంబంధించిన సంఘటనపై పోలీసులు ప్రశ్నావళి ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది. మంగళవారం నుంచి గురువారం వరకు విచారించనున్నారు. వీరరాఘవరెడ్డి ఐదు రోజులు కస్టడీకివ్వాలని పోలీసులు కోర్టు పిటిషన్‌లో కోరగా కోర్టు మూడు రోజులకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రామరాజ్యం స్థాపన పేరుతో వీరరాఘవరెడ్డి చేసిన కార్యక్రమాలన్నీ పోలీసు విచారణలో వెలుగులోకి రానున్నాయి.

రావల్‌కోల్ మున్సిపాలిటీని
ఏర్పాటు చేయాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మండల రూరల్ గ్రామాలను కలుపుతూ ఎల్లంపేట మున్సిపాలిటీకి బదులుగా రావల్‌కోల్ మున్సిపాలిటీగా పేరుమార్చి ఏర్పాటు చేయాలని మాజీ వైస్ఎంపీపీ గోపని వెంకటేశ్ సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చారు. రూరల్ గ్రామాలకు రావల్‌కోల్ మధ్యలో ఉందని, దానికి తోడు మిగతా గ్రామాలకన్నా రావల్కోల్‌లో ఎక్కువ జనాభా ఉన్నారని తెలిపారు.

ఉప్పల ఉదారం.. సొంతిల్లు సాకారం


జైపాల్‌యాదవ్, బాల్‌రాజ్, ఉప్పల వెంకటేశ్‌లతో కలిసి గృహప్రవేశం చేస్తున్న జంగమ్మ

ఆమనగల్లు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ తన ఉదారతను మరోసారి చాటుకున్నారు. నిరుపేద మహిళకు ఇల్లు కట్టించి గూడు కల్పించారు. సోమవారం గృహప్రవేశం చేయించి పేదరాలి కుటుంబంలో ఆనందాన్ని నింపారు. కోనాపూర్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి జంగమ్మ కూలిపనులు చేసుకుంటూ గుడిసెలో ఏళ్లుగా కాలం ఎల్లదీసింది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడాది క్రితం కోనాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సమయంలో వచ్చిన ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌కు జంగమ్మ ఇల్లు లేదని తన కష్టాలను వివరించింది. తనకు ఇంటి నిర్మాణానికి చేయూతనివ్వాలని వేడుకుంది. దీంతో వెంకటేశ్ తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటినిర్మాణం చేయిస్తానని జంగమ్మకు అరునెలల్లో రూ.10లక్షల వ్యయంతో రెండు గదులు, ఓ వంట గదితో ఆర్సీసీ ఇంటిని నిర్మాణం చేయించారు. సోమవారం మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల బాల్‌రాజ్, ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌లతో కలిసి జంగమ్మ గృహప్రవేశం చేసింది. గ్రామస్థులందరితో కలిసి సత్యనారాయణస్వామి వ్రతం చేసి ప్రసాదాన్ని అందజేసింది. వెంకటేశ్‌ను మాజీ ఎమ్మెల్యేలు, గ్రామస్థులు సత్కరించారు. ట్రస్ట్ ద్వారా సామాజిక సేవలను ఏటేటా విస్తరిస్తున్నామని, పేద పిల్లల చదువులకు ఆర్థికంగా చేయూతనిస్తున్నట్టు వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్ రావు, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ అనిల్, డాక్టర్ అఖిల్, మంజుల, నాయకులు నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డుపల్లి సంజీవ, శంకర్, శ్రీను, రమేశ్‌నాయక్, పంతునాయక్, గోపాల్, వెంకటయ్య, కె.రవి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, రాజు, జంగయ్య, యాదగిరి, చంద్రకాంత్, టిప్పుసుల్తాన్, శివ, శ్రీకాంత్, రాజు, ఈదమయ్య, కుమార్, హజీపాషా, యాదయ్య పాల్గొన్నారు.

కేటీఆర్ ఏ ముఖం పెట్టుకొని
ఆమనగల్లుకొస్తున్నారు?


విలేకరులతో మాట్లాడుతున్న రవి, రాజేశ్

కడ్తాల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు దీక్షల పేరిట కుట్ర రాజకీయాలు చేస్తున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, మండల అధ్యక్షుడు బోసు రవి అన్నారు. అధికారం పోయాక బీఆర్ఎస్సోళ్లకు ప్రజల బాధలు గుర్తొస్తున్నాయి అని ఎద్దేవా చేశారు. కడ్తాలలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో రవి, రాజేశ్ మాట్లాడారు. రైతు దీక్షల పేరుతో రాజకీయ లబ్ధికి కేటీఆర్ సాగిస్తున్న ఎత్తుగడలను ప్రజలు తిప్పికొడుతూనే ఉన్నారన్నారు. పదేళ్లు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. కల్వకుర్తి వెనుకబాటుకు కారణమైన కేటీఆర్ ఏ ముఖం పెట్టుకొని ఆమనగల్లుకు వస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు లక్ష రూపాయల వరకు పంటరుణం మాఫీ చేస్తామన్న బీఆర్ఎస్ పాలకులు.. ఏళ్ల పాటు కాలయాపన చేసి నాలుగు విడతలుగా కొందరికి మాత్రమే మాఫీ చేసినా అది వడ్డీకి కూడా సరిపోలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమిస్తామని మాట తప్పారన్నారు. ధరణి పేరుతో అనేక భూ అక్రమాలకు పాల్పడ్డారని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రైతులకు పంట రుణమాఫీ చేసిందని, రూ.6వేల చొప్పున రైతు భరోసా ఇచ్చిందన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు తులసీరామ్, భానుకిరణ్, సాయిగౌడ్, అశోక్‌గౌడ్, షాబుద్దీన్, నరేశ్, శ్రీకాంత్, రమేశ్ నాయక్, మహేశ్ పాల్గొన్నారు.


మున్సిపల్ సిబ్బందితో గొడవపడుతున్న నాయకులు

గుండ్లపోచంపల్లిలో ఫ్లెక్సీల వివాదం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని సాకేత్ గేటెడ్ కమ్యూనిటీలో, కృషి హోమ్ అనాథాశ్రమంలో బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన కార్యక్రమాలకు ఎంపీ సంతోష్‌రావు, ఎమ్మెల్యే మల్లారెడ్డి వస్తున్నారని స్వాగతం పలుకుతూ ఆదివారం రాత్రి ఫ్లెక్సీలు కట్టారు. సోమవారం ఉదయం గుండ్లపోచంపల్లి మున్సిపల్ సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించారు. కేసీఆర్ జన్మదిన కార్యక్రమం ఒకవైపు నిర్వహిస్తుండగానే సాకేత్ సమీపంలో, కృషి హోమ్ అనాథాశ్రమం వద్ద ఉన్న ఫ్లెక్సీలను తొలగించేందుకు సిబ్బంది చేరుకున్నారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు వారిని అడ్డుకున్నారు. పాలక కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ తమ ఫ్లెక్సీలను తొలగిస్తున్నారంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ మున్సిపల్ కమిషనర్ స్వామినాయక్‌కు ఫోన్ చేయగా ఆయన ఫోన్ లేపకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రీడల్లో సత్తాచాటిన
గురుకుల విద్యార్థినులు

కీసర, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): జ్యోతిబాఫూలే గురుకుల పాఠశాల విద్యార్థులు క్రీడల్లో జాతీయ స్థాయిలో సత్తాచాటారు. మలక్‌పేట్, చార్మినార్, నాంపల్లిలకు చెందిన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను కీసరలో ఏర్పాటు చేశారు. ఈ విద్యార్థినులు ఇటీవల ఢిల్లీ, జమ్ము, కాశ్మీర్, బిహార్, ఉత్తరాఖండ్‌లలో అండర్-14, 17, 19 విభాగాల్లో రైఫిల్ షూటింగ్ తదితర క్రీడల్లో పాల్గొన్నారు. విద్యార్థినల్లో నలుగురు ఇండియన్ ట్రయల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి జరగనున్న ఇండియన్ ట్రయల్ పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. సోమవారం ప్రిన్సిపాల్ రాములు విద్యార్థినులను అభినందించారు.



ప్రిన్సిపాల్ రాములతో విద్యార్థినులు


మున్సిపల్ ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

ఆర్పీపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మహిళలకు రుణాలు ఇప్పించి మోసం చేసిన ఆర్పీ లోలాక్షిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం డ్వాక్రా మహిళలు మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. లోలాక్షిని ఆర్పీ బాధ్యతల నుంచి తప్పించామంటూ అధికారులు చేతులు దులుపు కుంటున్నారే తప్ప మోసపోయిన మహిళలకు న్యాయం చేయటం లేదన్నారు. లోలాక్షి నుంచి వెంటనే తమ డబ్బులను రికవరీ చేసి బ్యాంక్‌కు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు వెడల్పు పనులు ..
అంబేడ్కర్ విగ్రహం తొలగింపు

కొడంగల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో భాగంగా కొడంగల్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ పనులు చేస్తున్నారు. నాలుగు రోజుల కిందట చౌరస్తాలో నూతన బోరు వేయించి మోటార్ బిగించారు. చౌరస్తా విస్తరణ అనంతరం అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్లు అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు య.రమేశ్‌బాబు, పట్టణ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ తెలిపారు. తొలగించిన విగ్రహాన్ని ఎంపీడీవో కార్యాలయంలో భద్రపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ వాదులు, యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ ఎం.కృష్ణంరాజు, జి.జగన్‌మోహన్, డీవీఎంసీ సభ్యుడు దస్తప్ప, బి.కృష్ణంరాజు, జి.రాములు, ఎ.రమేశ్ పాల్గొన్నారు.

విగ్రహం వద్ద అంబేడ్కరిస్టులు


కేసీఆర్‌కు
శుభాకాంక్షల వెల్లువ

వికారాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఆయనను సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ సైతం శుభాకాంక్షలు తెలిపారు.



కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, శుభప్రద్ పటేల్

ఘనంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఎగ్జామ్స్ కిట్స్ అందజేశారు. పలు చోట్ల మొక్కలు నాటి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఫిబ్రవరి 17



ఆమనగల్లు: కడ్తాలలో కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, గువ్వల బాల్‌రాజ్, ఉప్పల వెంకటేశ్, తదితరులు



చేవెళ్ల: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



షాద్‌నగర్ అర్బన్: మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు



కడ్తాల్: బోయిన్‌గుట్టతండాలో కేసీఆర్ కటౌట్ వద్ద సంబురాలు



యాచారం: మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జైపాల్ యాదవ్

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆమనగల్లులో మంగళవారం నిర్వహించే రైతు దీక్ష సభకు విజయవంతం చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు నిర్వహించే సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. దీక్షకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, సైదులు గౌడ్, రమేశ్ నాయక్, సతీష్, చంద్రశేఖర్ రెడ్డి, సుభాస్, రాజు, శివ, కుమార్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నేతలకు విమర్శించే స్థాయి లేదు'

మహేశ్వరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నిత్యం గ్రామాల అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని విమర్శించే స్థాయి తుమ్మలూరు కాంగ్రెస్ నాయకులకు లేదని తుమ్మలూరు మాజీ ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తుమ్మలూరులో కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యుత్ సబ్‌స్టేషన్, సీసీ రోడ్లు, డ్వాక్రా భవనాల వంటి అనేక రకాల అభివృద్ధి పనులు చేసిన సబితారెడ్డిపై లేని పోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కేఎల్లార్ పత్రికల ద్వారా సబితారెడ్డిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన కానుగుల చంద్రయ్య ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి రూ.5 వేలు, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సంతోష్‌బాబు రూ.2 వేలు, న్యాయవాది భాస్కర్ రూ.1,000 సాయం ప్రకటించారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కేశంపేట మండ ల కేంద్రంలో గూడ లింగయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు సీనియర్ జర్నలిస్ట్ గుండ్రాతి రమణగౌడ్ రూ.5 వేలు అందించారు.

మహిళా సాధికారతే లక్ష్యం

ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారితే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఫౌండేషన్ కార్యాలయంలో మహిళా జాబ్ మేళా నిర్వహించారు. ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అభినవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, చంద్రశేఖర్, కొండల్ రెడ్డి, రాములు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

కందుకూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సకాలంలో పశువులకు టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రేవంతి అన్నారు. సోమవారం మండలంలోని బాచుపల్లిలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 36 పాడి పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, రాచులూరు, లేమూరు పశువైద్యాధికారులు డాక్టర్ షాయిన్‌షేక్, డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

కేశంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి సూచించారు. మంగళగూడ, భైర్కాన్‌పల్లి, కేశంపేట గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో కిష్టయ్య, మాజీ సర్పంచ్ రూప్లానాయక్, అంజయ్య, వెంకటయ్య, సుజాత, కొట్టం నరేందర్ రెడ్డి, టీఏలు శ్రీనివాస్, నీలకంఠ బాబు తదితరులు పాల్గొన్నారు

తాగునీటి ఇబ్బందులు రావొద్దు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు , ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల మిషన్ భగీరథ్ ఇంట్రా, గ్రిడ్ అధికారులతో సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా తాగునీటి పథకాలు, నీటి సరఫరా, పైపులైన్ల మరమత్తులు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అందుబాటులో ఉన్న పంచాయతీల తాగునీటిబోర్లను సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. తాగునీటి సరఫరాకు ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఎక్కడైనా పైపులైన్లు లీకైతే వెంటనే సరి చేయాలన్నారు. అవసరమైతే ప్రస్తుతం వస్తున్న మిషన్ భగీరథ నీటి కేటాయింపులను పెంచేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. వేసవి ముగిసేవరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో డీఈలు మోహన్‌రెడ్డి, రామకృష్ణ, ఏఈలు, మిషన్ భగీరథ సిబ్బంది ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కడ్తాల్: పంటలకు నిరంతరం విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల మండలం మద్దెలకుంట తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌గౌడ్, పారేశ, రామచంద్రయ్య, బాస్కర్, శ్రీను నాయక్, కన్నునాయక్, షాబోద్దీన్, రాములు, వాల్యానాయక్, వాసు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



మంగళహారతి ఇస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దైవ చింతనతోనే మనస్సు ప్రశాతంగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డితో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



శంకర్‌పల్లి: విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ అందజేస్తున్న ట్రస్టు అధ్యక్షుడు రవికుమార్

నందిగామ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ ఈటగణేష్, మాజీ సర్పంచ్ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ప్రత్యేక తరగతులకు స్నాక్స్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దార సురేశ్, కుమార్‌గౌడ్, తుప్పుడు నర్సింహ, స్వామి, రమేష్, కృష్ణ, ఈశ్వర్, వేదం, జహీర్ పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మూడె రవికుమార్ ఆకాంక్షించారు. కొత్తపల్లి, మహాలింగపురం ఉన్నత పాఠశాలల్లో 35 మంది విద్యార్థులకు సోమవారం దాతలు హైమావతి, పేరుముళ్ల వెంకటలక్ష్మి సహకారంతో నోటు పుస్తకాలు, వార్షిక పరీక్ష ఫీజు, ఎగ్జామ్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కుళ్లయి నాయక్, శ్రీరాములు, అనుపమ, పద్మజ, పెంటయ్య, మాణిక్యరావు ఉన్నారు.

కడ్తాల్: స్థానికుల సహకారం, ఉపాధ్యాయుల పనితీరుపైనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఆధార పడి ఉందని ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం జంగం వెంకటేశ్, జంగం భార్గవ్‌రాజు గౌడ్ టిఫిన్ బాక్స్‌లు సమకూర్చారు. కార్యక్రమానికి ఆచారి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీరయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్, మాజీ అధ్యక్షుడు మన్యనాయక్, నాయకులు శ్రీశైలంగౌడ్, రెడ్యనాయక్, యాదయ్య, పాండు, నారాయణ, బాబు, సింహాద్రి, మల్లేశ్, రమేశ్, రాజు, శ్రీనివాస్ చారి, వీరేశ్, శ్రీను, రఘుపతి, సుదర్శన్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు రెండో రోజు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. ఏ రాష్ట్ర ప్రభుత్వాలు చేయలేని విధంగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ సూచనల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి చేసి చూపుతున్నారన్నారు. దేశంలో అధికారంలోని ప్రధాని మోదీ బీసీల గురించి ఏనాడు పట్టించుకోలేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇక నుంచి దేశ భవిష్యత్ అంతా రాహుల్ గాంధీదే అన్నారు. మరో నాలుగేళ్లలో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు.

కాంగ్రెస్‌లో కార్యకర్తలకు స్వేచ్ఛ

ఏఐసీసీ పెద్దలందరూ ఎన్ఎస్‌యూఐ నుంచి వచ్చిన వారేనన్నారు. ఓపిక నిబద్ధత, క్రమశిక్షణ గల కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో పదవులు వరిస్తాయన్నారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాను మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ప్రతీ కార్యకర్తకు స్వేచ్ఛ ఉంటుందని, అవసరమైతే ముఖ్యమంత్రిని కూడా ప్రశ్నించే హక్కు ఉంటుందన్నారు. అదే విధంగా యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ లు శక్తివంతంగా పని చేసినప్పుడల్లా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సిద్ధంగా ఉందన్నారు. ప్రజలతో సత్సంబంధాలు మెరుగుపర్చుకొని ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకొని సర్పంచ్ మొదలుకొని ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్లను రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కైవసం చేసుకునేలా యువజన కాంగ్రెస్ నాయకులు పని చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ తరగతుల్లో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, జాతీయ యువజన కాంగ్రెస్ ఇంచార్జీ కృష్ణ, సురభి, దేవ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, రాఖేష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తో పాటు రాష్ట్రంలోని ఆయా జిల్లాలకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మేకగూడకు బస్సు నడపాలి



రీజినల్ మేనేజర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నందిగామ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేకగూడకు రాజేంద్రనగర్ డిపో నుంచి బస్సులు నడపాలని సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య రాజేంద్రనగర్‌లోని ప్రాంతీయ మేనేజర్ భద్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. మేకగూడతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, తరుచూ కూరగాయలు, పాలు హైదరాబాద్‌కు తీసుకొస్తారని వివరించారు. బస్సు బంద్ కావడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన మేనేజర్ బస్సు నడిపిస్తామని తెలిపినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దేపల్లి అశోక్‌గౌడ్, రాఘవేందర్, సాయిప్రకాష్, రవి, సత్యం, శ్రీను, దీక్షిత్ ప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు ఉండొద్దు

చేవెళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో కోతలు లేకుండా పంటలకు విద్యుత్ సరాఫరా చేయాలని బీఆర్ఎస్ చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి దేశమోళ్ల ఆంజనేయులు, చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్ కోరారు. సోమవారం మండల విద్యుత్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలసి ఏఈ రాజేందర్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వారం రోజులుగా మండలంలో రాత్రిపూట ఆరు గంటలు కరెంటు కోతలు విధిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ డైరెక్టర్లు గోనే కరుణాకర్‌రెడ్డి, వెంకటేశ్, నాయకులు శేఖర్, రాజు, వెంకటేశ్, ఆంజనేయులుగౌడ్. దండు సతీష్, కృష్ణ, బాలు ఉన్నారు.

మానవత్వం చాటిన పోలీసులు



మురగదాస్‌ను మాతృదేవోభవ ఆశ్రమానికి అప్పగిస్తున్న పోలీసులు

ఆదిబట్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేకుండా నాలుగు రోజుల నుంచి బొంగ్లూర్ పరిసర ప్రాంతంలో తిరుగుతున్న వ్యక్తిని ఆదిబట్ల పోలీసులు గుర్తించి మాతృదేవోభవ అనాథ ఆశ్రమం సభ్యులకు అప్పగించి మానవత్వం చాటుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన మురగదాస్(65) మాసిన బట్టలు, కాలికి గాయమై మతిస్థిమితం లేకుండా బొంగ్లూర్ ప్రాంతంలో తిరుగుతున్నాడు. పెట్రోలింగ్ పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. తమిళనాడు రాష్ట్రం, పేరు మురగదాస్ తప్ప వివరాలు ఏ వివరాలు చెప్పలేదని ఎస్సై వెంకటేష్ తెలిపారు. పరిస్థితి గమనించిన పోలీసులు మాతృదేవోభవ అనాథ ఆశ్రమం చైర్మన్ గట్టు గిరికి సమాచారం అందించడంతో టీం సభ్యులు వచ్చి మురగదాస్‌ను ఆశ్రమంకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రాజు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన కొనగట్టు



కొనగట్టు శివాలయంలో హోమాలు జరిపిస్తున్న దంపతులు

చేవెళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయం శివనామస్మరణతో మార్మోగింది. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఆలమ చైర్మన్ సున్నపు వసంతం, సున్నపు మాణిక్యప్రభుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుడు సురేశ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దంపతులు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మల్లేశ్. శ్రీనివాసచారి, ఆనంద్, మణిక్యప్రభు, దేవేందర్, సత్యనారాయణ, రాంరెడ్డి, పర్మయ్య. యాలాల మహేశ్వర్‌రెడ్డి, శంకరయ్య తదితరులు ఉన్నారు.

సంతకు మూడెకరాలు కేటాయించాలి

యాచారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్‌లోని సర్వే నంబర్ 640లో మూడెకరాల స్థలాన్ని వారంతపు సంత కోసం కేటాయించాలని సోమవారం మాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పడకంటి శేఖర్, జహంగీర్ తదితరులు నగరంలోని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. వారాంతపు సంత కోసం స్థలం లేక వ్యాపారులు, రైతులు నానా ఇబ్బందుల పాలవుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ స్థలం తప్ప మరోచోట స్థలం లేదని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గాల్లయ్య, రమేశ్, బాలరాజ్, రాజిరెడ్డి ఉన్నారు.

మండల ఏర్పాటుకు పోరాటం ఉధృతం

తలకొండపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు ఎంతటి పోరాటానికైన వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. క్యాబినెట్‌లో ఆమోదించిన 11 కొత్త మండలాల జాబితాలో గట్టిప్పలపల్లి పేరు లేకపోతే ఆమరణ నిరహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలోచేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారం 108వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు ఆంజనేయులు గౌడ్, శరత్‌చంద్ర, కార్యదర్శి అనిల్ ఉన్నారు.

క్రైం కార్నర్

ఆటో చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలోని ఓ ఆస్పత్రి వద్ద ఈనెల 9న పార్క్ చేసిన ఆటో చోరీకి గురికాగా సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన నాగశేషును అరెస్ట్ చేశారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం నేదునూరు గ్రామానికి చెందిన సదానందం గౌడ్ ఈనెల 9న ప్రయాణికులను తీసుకొని కడ్తాలకు వచ్చి ఆగస్త్య ఆస్పత్రి వద్ద ఆటోను పార్క్ చేశాడు. తిరిగి వచ్చి చూసే సరికి ఆటో లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. సాంకేతిక ఆధారాలతో క్రైం టీం సిబ్బంది రామకోటి, రాజశేఖర్ తలకొండపల్లి చౌరస్తా వద్ద ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నాగశేషును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోటీలకు వెళ్లాల్సిన కోడె ఆకస్మిక మృతి

చౌదరిగూడ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలంలో మంగళవారం నిర్వహించనున్న ఎద్దుల బండ లాగుడు పోటీలో పాల్గొనాల్సిన కోడె సోమవారం సాయంత్రం ఆకస్మికంగా మృత్యువాత పడింది. ఈ ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. చౌదరిగూడ గ్రామానికి చెందిన గొల్ల వెంకటేశ్‌యాదవ్ రెండేళ్ల క్రితం కర్నూలు జిల్లా యనగండ్ల నుంచి కోడెలను కొనుగోలు చేశాడు. బండలాగుడు పోటీలో శిక్షణ ఇచ్చి బహుమతి సాధించడమే లక్ష్యంగా కోడెలను సిద్ధం చేసేవాడు. మంగళవారం కేశంపేట మండలంలో జరిగే బండ లాగుడు పోటీలకు సోమవారం ఉదయం కోడెలతో ప్రాక్టీస్ చేయించాడు. మధ్యాహ్నం కోడెలను షేడ్‌లోకి పంపించి ఇంటికి వెళ్లాడు. సాయంత్రం షెడ్‌కు వచ్చి చూసేసరికి కోడె కిందపడిపోవడం చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. అనంతరం మృత్యువాత పడిన కోడెను జేసీబీ సహాయంతో దహన సంస్కరణలు నిర్వహించారు. సైరా నరసింహా రెడ్డి చిత్రంలో సైతం ఈకోడె నటించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కడీలు కూల్చిన వారిపై కేసు

కేశంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): యజమానుల అనుమతి లేకుండా అక్రమంగా ప్రవేశించి కడీలను పగలగొట్టిన వారిపై కేసు నమోదు చేసినట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు. సంగెం గ్రామ శివారులో 32 సర్వే నంబర్‌లో కుమ్మరి జంగయ్య, రామచంద్రయ్య 1977లో మహ్మద్‌లాయక్ అలిఖాన్ దగ్గర 15 ఎకరాలు, ఎకామ్ అలికాన్ వద్ద ఇదే సర్వే నంబర్‌లో 21.20 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. అనంతరం వారి వారసులు కబ్జాలో ఉంటూ సాగు చేసుకుంటున్నారు. గ్రామానికి చెందిన కడారి మల్లేష్ పలుమార్లు అక్రమంగా ప్రవేశించి, పొలం తనది అంటూ గొడవలు చేసేవాడు. ఈ వివాదం కోర్టు పరిధిలో ఉండడంతో ఇరుపక్షల మధ్య పెద్దలు రాజీ కుదిర్చారు. కోర్టు తీర్పు వచ్చే వరకు పొలంలోకి ఇరుపక్షలు వెళ్లొద్దని నిర్ణయించారు. రాజీని ఉల్లంఘిస్తూ ఖాజాపాషా, అహ్మద్ ఖాన్, కడారి మల్లేష్, కడారి శ్రీను, కడారి అనిల్, జంగయ్యతోపాటు మరికొంత మంది ఆదివారం పొలంలోకి ప్రవేశించి, హద్దుగా ఉన్న కాడీలను పగలగొట్టారు. సోమవారం కుమ్మరి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జక్కు అనంతరెడ్డి

సామాజిక న్యాయం కాంగ్రెస్ లక్ష్యం

ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, గ్రామాల సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి అన్నారు. గ్రామాల అభివృద్ధి, పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఎస్సీ కాంపనెంట్ నిధుల నుంచి రూ.10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం పనులను సోమవారం మాజీ సర్పంచ్ కొప్పు జంగయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తిప్పిరెడ్డి నారాయణ రెడ్డితో కలిసి ప్రారంభించారు. రాజకీయాలకు చోటులేకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగన్, నాయకులు రాఘవేందర్, కృష్ణయ్య, వెంకటేశ్, మల్లయ్య, నర్సింహ, మాదవరెడ్డి, లింగారెడ్డి, శేఖర్ రెడ్డి, యాదయ్య, విజయ్‌రాథోడ్ ఉన్నారు.

ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు

ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒకరి నేత్రదానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర అన్నారు. ప్రతిఒక్కరూ నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాషాతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 21 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి ఐఓఎల్ ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి దోనాదుల మహేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ, సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి, రాంరెడ్డి, జూలూరి రమేశ్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

కందుకూరు,ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా వి.సురేందర్‌గౌడ్(కందుకూరు)ఏకగ్రవంగా ఎన్నికయ్యారు. సోమవారం కందుకూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో ఎంపీడీవో సరిత, ఎంపీవో గీత హాజరయ్యారు. ఈ సందర్భంగా కందుకూరు పంచాయతీ కార్యదర్శి సురేందర్‌గౌడ్‌ను మండల అధ్యక్షుడిగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్‌గౌడ్(బాచుపల్లి), ఉమాదేవి(కొత్తగూడ), కోశాధికారిగా మహేష్‌బాబు(భైరాగిగూడ), ప్రధాన కార్యదర్శిగా శ్రీను(చిప్పల్లిలపల్లి), ప్రచార కార్యదర్శిగా రాఘవేందర్(మురళీనగర్), ఆర్‌సురేందర్(బేగరికంచ), సలహాదారులుగా శ్రీహరి(దెబ్బడగూడ), మీడియా కన్వీనర్‌గా సెల్వమణి(బేగంపేట), ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రక్తదానం.. మహాదానం

కేశంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రక్తదానం మహా దానమని అయ్యప్ప సేవా సమితి కేశంపేట మండల సభ్యుడు అన్నారు. గురుస్వామి సతీషన్ నాయర్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం కేశంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, కేశంపేట అయ్యప్ప సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. శిబిరంలో 35 మంది యువకులు రక్తదానం చేశారు. అంతకుముందు గురుస్వామి సతీషన్ నాయర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సజ్జల విశ్వానాథం, మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్ రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, పాక్స్ డైరెక్టర్ మఠం చంద్రశేఖర్, అయ్యప్ప సేవా సమితి సభ్యులు రమేష్, శ్రీకాంత్ రెడ్డి, గోపాల్, యుగందర్, మహేష్, మహేందర్, జాంగీర్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

యాచారం. ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీసాలతండాలో పాఠశాల స్థలం ఆక్రమించి నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను తక్షణమే ఆపాలని సోమవారం గ్రామస్తులు ఎంపీవో శ్రీలతకు వినతిపత్రం అందించారు. సర్వే నంబర్ 44లోని రెండెకరాల 20 గుంటల భూమిని కొందరు ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారని వరించారు. గతంలో ఇదే భూమిని ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించారని, పది గుంటల భూమిలో పాఠశాల భవనం నిర్మించారని చెప్పారు. దీనిపై ఎంపీవోను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఇంటి నిర్మాణం ఆపాలని నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చామన్నారు. ఆ స్థలాన్ని సర్వేచేసి పంచాయతీ భూమి అయితే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. రాత్రి వేళ ఇంటి నిర్మాణం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.